# రిటైర్‌మెంట్

ప్రభుత్వోద్యోగంలో చేరేక ఏదో ఒకరోజు పదవీ విరమణ చేయక తప్పదు.

అయితే రిటైర్‌మెంట్ అంటే భయం కొంతమందికి ఎందుకనో. చాలా సంవత్సరాలు చాకిరీ చేసేక విశ్రాంతి తీసుకోవచ్చునుకదానని సంతోషించరు వారు.

మా ఆఫీసులో సెక్షన్ హెడ్ ధర్మారావు శనివారంనాడు రిటైర్ అవుతున్నాడు. ఆయనకు సర్వీసు పూర్తయింది. ప్రభుత్వం ఈమధ్యన పదేపదే రిటైర్‌మెంట్ వయస్సు పెంచుతాం అంటున్నారు కాని పెంచటం లేదు. ఈ విషయం మా ధర్మారావుకు ఇబ్బందిగావుంది.

శనివారం రాత్రి డిన్నర్ ఏర్పాటు చేశాం. భగవద్గీత, చేతికర్ర, శాలువా ఇత్యాదివి కొన్నాం. మొత్తం ఖర్చు సుమారు ఐదు వందలు అంచనా.

సెక్షన్ హెడ్ దాదాపు పనిచెయ్యటం లేదనే చెప్పాలి. ఆరోజు రిటైర్‌మెంట్ అంటే ఎవరికి మాత్రం ఎలా పనిచెయ్యాలని వుంటుంది చెప్పండి?

రిటైరయ్యాక ఏం చెయ్యాలి? రిఫరెన్సులు పెట్టలేదని వేధించుకు తినటానికి ఎవరుంటారు? ఇంటి పనులు చేయించుకోడానికి సేవకులు వుండరు, చేతిసంచి తీసుకుని బజారుకు వెళ్ళాలి. తెల్లవారి లేస్తే ఎన్ని నమస్కారాలు? ఎన్ని వ్యవహారాలు? ఇవన్నీ ఏమైపోవాలి? ఇదీ ఆయన బాధ.

నేను మరికొంతమంది కొలీగ్స్ సెక్షన్ హెడ్ దగ్గరకు వెళ్ళాం.

"సార్, మీకు రాత్రి నటరాజ్‌లో డిన్నర్ ఏర్పాటు చేశాం. మీ ఇంటికి వచ్చి తీసుకు వెళతాం" అందరం ఒక్కసారే అన్నాము.

"ఎందుకయ్యా కాఫీలు ఇస్తే పోలా, ఏమిటో పిచ్చివాళ్ళు వినరు" అని గొణుగుతున్నారు ఆయన.

"అదేమిటి సార్, మీతో భోజనం చెయ్యడానికి మాకు ఇదేకదా అవకాశం మరల మీరు ఎక్కడో, మేము ఎక్కడో మాకు ఆ భాగ్యం కలగనివ్వండిసార్" అన్నారు కొంతమంది.

వాళ్ళల్లో ఆయన్నిరోజూ "చండశాసనుడు" "ఎప్పుడు వదలిపో తుందో ఈ శని" "జిడ్డుగాడు" అని బిరుదులు ఇచ్చి సత్కరించేవాళ్ళు కూడా వున్నారు. ఒక విధంగా ఆయన రిటైర్ అవటం పెద్ద రిలీఫ్‌గా వుందని చెప్పాలి.

"....సరేలే, కానివ్వండి" అని అయిష్టంగా ఒప్పుకున్నారాయన.

ఆయన ఎలాగూ రిటైర్ అవుతున్నారుకదానని, మిగతా సెక్షన్ వాళ్ళం, ఆయన సెక్షన్ వాళ్ళం అందరం కులాసాగా గడిపేస్తున్నాం.

సమయం సాయంత్రం నాలుగు.

ట్రంక్‌కాల్ వచ్చింది సెక్షన్ హెడ్‌కి.

ఆయన ఫోన్‌లో మాట్లాడుతూ, లేచి బల్లమీద కూర్చుని కులాసాగా కాళ్ళు ఊపుతూ ఫోన్‌లో మాట్లాడుతున్నారు. మాట్లాడటం అయింది.

మేమందరం ఆయన బల్ల దగ్గరకు చేరేము.

"ఏమోయ్, మీ అందరితో గడపడానికి ప్రభుత్వం నాకు మరో మూడు సంవత్సరాలు పర్మిట్ చేసింది. రిటైర్‌మెంట్ ఏజ్ ఏభై ఎనిమిదికి పెంచారు" అన్నారాయన.

హతోస్మి !

మా పని అయిపోయింది.

ఐదు వందలు ఖర్చుపెట్టి రాత్రికి చేసిన ఏర్పాట్లు ఏం చేయాలి?

"సారీ సార్, మేము రాత్రికి డిన్నర్ ఏర్పాట్లు చేశాము. "భోజనం చేయక తప్పదు" అన్నాడు మాలో ఒకడు.

ఎందుకంటే రేపటినుండి మళ్ళీ ఆయనతో కాపురం చెయ్యాలికదా!

"నెవర్ మైండ్, రాత్రికి డిన్నర్‌వుంది. అయితే ఆ డిన్నర్ మీరు ఇవ్వటంలేదు నేనే మీకు ఇస్తున్నాను. ఏమంటారు? అన్నారాయన.

మేము ఇంకేం చెప్తాం?

"ఈయన మమ్మల్ని మరో మూడు సంవత్సరాలు తింటాడు, ఈయన పీడ విఐగడవలేదు" అనుకుంటూ ఎవరిసీటు పనుల్లోవాళ్ళు నిమగ్నులయ్యాము.

....o....